# 77. మీడియమ్ సమస్య

ఆఫీసు పనిమీద నాగపూరు బయల్దేరితే ఎలా తెలిసిందో గాని, బండి బైల్దేరుతూ వుండనగా రైల్వేస్టేషన్ కొచ్చి కలుసుకున్నాడు నరిసిమ్మూర్తి. "చిన్న వుపకారం చేసిపెట్టాలి" అని ప్రారంభించేడు. "అవును. నాగపూర్‌లో కమలాఫలాలు బావుంటాయి. నీకో పాతిక తెమ్మంటావు. అంతేకదా." అన్నాను. "నువ్వన్నీ ఇలాటి జోకులే వేస్తావు. అఫ్‌కోర్స్; మా అమ్మ పేరు కమలమ్మేగాని; నువ్వొచ్చేటప్పుడు ఆవిణ్ణి తీసుకొస్తే చాలు. కమలాఫలాలు ఓ బుట్ట కట్టించి తనే తెస్తుంది." అని, వాళ్ల తమ్ముడు రాసిన ఉత్తరం ఒకటి ఇచ్చేడు. "ఎడ్రస్ దాంట్లో వుంది. ఈ బండి రేపు ఉదయం ఎనిమిది గంటలకి నాగపూరు చేరుతుంది. తిన్నగా మా తమ్ముడింటికి వెళిపో. నువ్వొస్తున్నట్టు నేనిప్పుడే మా తమ్ముడికి టెలిగ్రాం ఇస్తాను........." అంతే. బండి బయల్దేరేసింది కాస్తా స్పీడు అందుకుంది.

"నువ్వు వీలున్నంత వేగిరం వచ్చి అమ్మని విశాఖపట్నం తీసుకు పో. నీకు వీల్లేదంటే మరి తెగించి ఏదో వోరోజున లింకు ఎక్స్‌ప్రెస్ ఎక్కించి నీకు టెలిగ్రాం ఇచ్చేస్తాను." అది -శంకరం నరిసిమ్మూర్తికి రాసిన ఉత్తరం. అంచేత ఇదేదో అత్తాకోడళ్ల తగువే - ముదిరిపోయింది. అనుకున్నాను.

నరిసిమ్మూర్తి శంకరం పేరిట ఇచ్చిన టెలిగ్రాంలో నేనొస్తున్నాననీ తన ఇంట్లోనే ఉంటాననీ వుంది తప్పా కమలమ్మ గార్ని నాతో పంపించవచ్చు నన్న సూచన లేదు. అంచేత కమలమ్మగార్ని తన యింటికి తప్పనిసరి పరిస్థితుల్లో అయినాసరే రప్పించుకోడం నరిసిమ్మూర్తికి ఇష్టంలేదని అనుకున్నాను.

వారం రోజులుండవలసి వస్తుందనుకున్న నా పని అక్కడికి చేరిన నాడే అయిపోయింది. "మీకు వెంటనే వెళిపోవడానికి టిక్కెట్ దొరకదు. కనుక ఎల్లుండి దాకా ఇక్కడున్నట్లు సర్టిఫైచేస్తాం. ఎల్లుండికి టిక్కెట్ కొనుక్కోండి." అన్నాడు నాగపూర్ ఆఫీసరు. ఈ సంగతి శంకరానికి ఫోన్ చేసి చెప్పేను. అంతే. "నేనిప్పుడు రైల్వేస్టేషనుకే వెళ్తున్నాను. నీ టిక్కెట్ కూడా తెచ్చేస్తాను." అన్నాడు. ఆ సాయంకాలం నేను శంకరం ఇంటికి వెళ్లేసరికి "నీతో బాటు మా అమ్మని విశాఖపట్నం తీసుకుపోవాలోయి." అని రెండు టిక్కెట్లూ చేతిలో పెట్టాడు.

"అదికాదూ; నాకు తెలీక అడుగుతాను; ఇంత అర్జంటుగా ఎందుకు పంపించేస్తున్నావు, మీ అమ్మగార్ని? అన్నా తమ్ముడూ ఆస్తులు పంచుకున్నట్లు అమ్మపోషణా భారాన్ని కూడా పంచుకో వల్సిందేనా?" అన్నాను. "కడుపు చింపుకుంటే కాళ్లమీద పడుతుంది." అని నెత్తికొట్టుకున్నాడు శంకరం.

మర్నాడు ఉదయం అయిదున్నరకే మెలుకువ వచ్చింది. కమలమ్మ గారి కేకతో. "ఒరే, శంకరం, మరుగుదొడ్లో దీపం వెయ్యరా నాయనా!"

శంకరం, గాయత్రీ పడుకున్న గదితలుపు ధడాలుమని తెరుచుకుంది. గాయత్రి విసురుగా హాల్లో కొచ్చి ఒక స్విచ్చి వేసి; మళ్లీ అంతచప్పుడూ చేసి తలుపు వేసుకుంది.

ఏడున్నరకి, ముందుతలుపు బెల్‌మోగింది. తలుపు తెరవాలని వెళ్లిన కమలమ్మ గారు

వెనక్కొచ్చేసి "నాయనా, గణపతీ! వీధి తలుపు తాళం వేసుంది, తియ్యమ్మా, ఎవరో ఒచ్చినట్టుందీ!" అంది.

"మై గుడ్నెస్! మెయిన్ డోర్ లాక్ చేసుందా?" అంటూ వెళ్లాడు శంకరం కొడుకు.

ఒచ్చిన మనిషి రెండు చేతుల్నీ సందిట్లా చేసుకుని పెద్ద దొంతరగా బట్టలు తెచ్చేడు.

"గాయత్రీ! చాకలాడు బట్టలు ఇస్త్రీ చేసి తెచ్చేడే. వాడికి తొమ్మిది రూపాయలిచ్చి పంపించు." అని కమలమ్మగారు పెట్టిన కేక విని గాయత్రి వంటింట్లోంచొచ్చింది. "హుఁ! చాకలాడూ మంగలాడూ అనకూడదని ఎన్నిమాట్లు చెప్పినా బుర్రకెక్కదు. ఖర్మ, ఖర్మాని!"

"మరి ఏమిటనాలిరా?" అన్నాను గణపతితో, మెల్లిగా.

"ధోబీ ఏమొచ్చి షర్టులూ ప్యాంట్సూ శారీసూ ఐరన్ చేసుకొచ్చేడు. నైన్ రుపీస్ ఇయ్యి అనాలి. ఈ మాత్రం దానికి మమ్మీని కిచన్‌లోంచి పిల్చింది గ్రాణ్మా."

నాకు కొద్దిగా అర్థమయింది. మళ్లీ గణపతే అన్నాడు; "గ్రాణ్మాకి ఇంగ్లీష్‌లో వర్కింగ్ నాలెజ్‌వుంది. కానీ, మాట్లాడదని మమ్మీ హేట్ చేస్తుంది. మరుగుదొడ్డి, చీపురు, అంటుంది. గాని లెట్రినూ, బ్రూమూ అనదు. పాప నిద్దట్లో పాస్ పోస్తేనేమో, గుంటముండ పక్కలో ఉచ్చ పోసింది - అని కేకేస్తుంది."

కమలమ్మగారు మేం ఉన్న దగ్గిరికొచ్చింది. "ఒరే గణపతీ; నా తిరుగు ప్రయాణం రేపేనుట్రా. నీకుపుణ్యాం వుంటుంది గాని ఈ కలంలో కాస్త సిరాపోసి ఇయ్యి నాయనా. వెళ్లగానే ఉత్తరం రాయాలి కదా."

వాడు నవ్వేడు. "టుమారో నీ రిటన్ జర్నీ. వైజాగ్ రీచ్ అవగానే లెటర్ రాసి పోస్ట్ చెయ్యాలి. సో, పెన్‌లో ఇంక్ పోసివ్వాలి. ఓకే?" అని ఆపెన్ అందుకున్నాడు. "మమ్మీతో చెప్పన్ లే. డోంట్ వర్రీ."

"ఏడిశావులే భడవకానా."

వాడు పెన్ తెచ్చి ఇచ్చేలోగా గాయత్రి మాకిద్దరికీ కాఫీ ఇచ్చి "ఎక్ సూజ్మీ" అని వెళ్లింది. కమలమ్మగారు కాఫీ చప్పరించి; "నా బంగారు తండ్రే. ఇదుగో, ఇలా చూడు; ఈ కాఫీలో చక్కెరెయ్యడం మర్చిపోయింది మీ అమ్మ. ఓ చెంచాడు పంచదార తెచ్చిపెట్టరా?"

"మమ్మీ, గ్రేణ్మా కాఫీ నో షుగర్, వన్ స్పూన్ షుగర్ ప్లీజ్," అని అరుస్తూ వాడు వెళ్లేడు.

"చూడండి బాబూ, ఇదీ వరస. నా చిన్నకోడలికి ఇంగ్లీషంటే సరదా; తెలుగంటే చిరాకూనూ. ఒరే, గణపతీ; బడికి వేళవుతోంది, కంచం పెట్టుకోరా; అన్నం వొడ్డిస్తాను అనకూడదట. గణపతీ డాళింగ్, స్కూల్‌కి టైమౌతోంది; ప్లేట్ ఎరేంజ్ చేస్కో, మీల్స్ సర్వ్ చేస్తాను అనాలిట. పిల్లాడు తెలుగు మాట్లే మర్చిపోతున్నాడు. నాయినమ్మో అమ్మమ్మో ఇంట్లో వుంటే తెలుగు మాటలు కొన్నైనా వస్తాయి తల్లీ- అంటే ఛీ కొడ్తుంది."

★★★

కమలమ్మ గార్ని నరిసిమ్మూర్తి ఇంటికి దిగబెట్టిననాడు సాయంకాలం అతను నన్ను ఫోన్‌లో అడిగాడు. "అమ్మని మా శంకరం ఎందుకు పంపించేసేడో నీకేమైనా తెలిసిందా?" అని. "తరవాతొచ్చి చెప్తాలే" అనేశాను.

ఆ ఆదివారం నేనెళ్ళేసరికి కమలమ్మగారు వీథిగుమ్మంలోకి వినబడేలాగ అరుస్తోంది. "చూడే, సీతా, నీ కూతురేం చేసిందోను! ఒద్దే ఒద్దే అంటూంటే కూడ డస్ట్‌బిన్నుకి ట్రే తగిలేసి ఆ చేత్తోటే వాటర్‌ట్యూబ్ తీసికెళ్లి టబ్‌లో పెట్టేసింది! పైగా బకెట్ ముంచీసింది!"

"అదేమిటే పద్మా; చెత్తకుండీ ముట్టుకున్న చేత్తోటే నీళ్లగొట్టాం పట్టుకుని కుండీలో పెట్టేడమే కాకుండా బాల్చీ ముంచీశావా?" అని సీత కూతుర్ని కోప్పడింది.

"నర్సిమ్మూర్తి లేడాండీ, పిన్నిగారూ?" అని అడిగాను.

"షేవింగ్ చేసుకుంటున్నాడు బాబూ, టెన్ మినిట్స్‌లో వచ్చేస్తాడు." అని లోపలి కెళ్లిందావిడ. నాకు నవ్వొచ్చింది. కమలమ్మగారు మంచినీళ్లగ్లాసు రెండో మనవరాలు చేత పట్టించుకొచ్చింది.

"నీ పేరేంటమ్మా?" అంటూ అందుకున్నాను.

"దీని పేరు లలిత, పెద్దదాన్లా డర్టీగా వుండదు. ఎప్పుడూ ఫ్రెష్ గా స్మార్ట్‌గా ఉంటుంది." అని కమలమ్మ గారు చెప్పగానే ఆ పిల్ల నవ్వుతూ "కడిగిన ముత్యంలా మెరిసిపోతూ వుంటానట; మా అమ్మ అంటుంది."

"ఉద్ధరించేవులే."అని కమలమ్మగారు లోపలికెళ్లింది.

"మా నాయినమ్మకి ఇంగ్లీషు పిచ్చి బాబాయిగారూ. నిన్న రాత్రి టీవీ చూస్తూ కథ విసుగ్గా ఉందని అనడానికి స్టోరీ బోరుగా వుందంది. దీపాలు పోయాసరికల్లానేమో కేండిలు వెలిగించరా అంది. రాత్రి పడుకునేటప్పుడు నా బెడ్ షీటు ఛేంజి చేసేరా - అని అడిగింది. ఇప్పుడు చూడండి కావలిస్తే; నాన్నారు గెడ్డంగీసుకుని రాగానే టిఫిన్ రెడీ అని మిమ్మల్ని "డైనింగ్ టేబిల్" దగ్గిరికి "ఇన్వైట్" చేస్తుంది." అని గలగలా నవ్వింది ఆ పిల్ల.

★★★

"మీ అమ్మగారు నీ దగ్గిరుంటే నీకు బరువా, నర్సిమ్మూర్తి?"

"ఛీ ఛీ అదేంమాట? మా ఆవిడకి మాత్రం మా అమ్మ మాటలిష్టం వుండవంతే".

"మీ అమ్మ మళ్లీ నాగపూరు వెళిపోతాననకుండా ఇక్కడే ఉండాలంటే మీ ఆవిణ్ణి ఇంగ్లీషు మాట్లాడేమని చెప్పు. మీ మరదలు తెలుగు మాట్లాడుంటే ఈవిడ అక్కడే ఉండేవారు. పెద్దయిపోయారు కదా. మనమే వాళ్ల మీడియంలో మాట్లాడాలి. అదే ఈ సమస్యకి పరిష్కారం." అని చెప్పేను నేను. ★

# 78. పురుష లక్షణం

**మా** ఆఖరి చిన్నాన్న గారబ్బాయి కనకయ్య నాకు వరసకి తమ్ముడే అయినా వాడు మా రెండో అబ్బాయి కన్నా రెండేళ్లు చిన్నవాడు. మొన్నీ మధ్య ఓరోజు మా చిన్నాన్న వాణ్ణి వెంట బెట్టుకుని నా దగ్గిరికొచ్చి "ఒరే గోపాలా, వీడికేదైనా ఉద్యోగం చూసిపెడుదూ! నీకు పుణ్యం ఉంటుంది." అన్నాడు. "నీకు పెద్ద వాళ్లు బోల్డుమంది తెలుసుకదా, ఎవరితోనైనా ఒక్క మాట చెప్పేవంటే పనైపోతుంది." అన్నాడు. "నాకు పెద్ద పెద్దవాళ్లు బోల్డు మంది తెలియడమైతే తెలుసును గాని వాళ్లలో ఎవరూ కూడా నా మాట మీద ఎవరికయినా ఉద్యోగాలిస్తారని గానీ కనీసం ఒక ఊర్నించి ఇంకో ఊరికి ట్రాన్స్‌ఫర్ చేస్తారని గానీ నాకు నమ్మకంలేదు. ఐనా వీడికి దగ్గిర దగ్గిర